క్లుప్తంగా

రూ.20 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం


బోరావారి వీధిలో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు బోరావారి వీధి, లలితానగర్ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.20 లక్షలతో సీసీ డ్రెయిన్లు నిర్మించనున్నారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, కె.కె.రాజు పార్టీ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, వార్డు నాయకులు బొడ్డేటి కిరణ్, ఎం.సునీల్, విజయ్‌పాల్, పి.రమాదేవి, ఇ.ప్రకాష్, శ్యామల, శేషు, హరి, ఫరూఖ్, సుశీల, నవాబ్, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో బుల్లయ్య కాలేజీ విద్యార్థిని ప్రతిభ


కల్పితను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: సన్యుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్(ఎస్‌బీకేఎఫ్) 8వ అంతర్జాతీయ పోటీలు ఈ నెల 5 నుంచి 9 వరకు నేపాల్ పోఖారాలో జరిగాయి. అంతర్జాతీయ స్థాయి ఉమెన్స్ బాక్సింగ్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ కళాశాల బీఏ ఫస్టియర్ విద్యార్థిని బి.కల్పిత 54 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ కల్పితను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీన్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన ఆధ్యాత్మిక సంకీర్తనలు


కీర్తనలు ఆలపిస్తున్న గాయనీమణులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన ఆధ్యాత్మిక సంకీర్తన కార్యక్రమం అలరించింది. పి.లక్ష్మీనాయుడు శిష్య బృందం పాడిన వనమాలి అమృత వరదాయని భక్తులను ఆకట్టుకుంది. చందమవన్నె కాగడగ జనాది, అడకనే వరాలిచ్చే, ఏపేరుతో నిను పిలిచినా, శరణు శరణు, ఇంద్రకీలాద్రిపై, చూడ రమ్మ సతులాల, వేడుకొందామా, చక్కని తల్లికి పిల్లలు కీర్తనలు మృదుమధురంగా ఆలపించారు. వీరికి కె.శ్రీరామ్ శ్రీనివాస్ వయోలిన్ పై, ఆర్.శ్రీచరణ్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. గాయకులు మనోజ్ఞ, అభిజ్ఞ, షైవి, హంసిక, సాన్విక, ఇషితలను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించి అభినందించారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లపై బడ్డీలు, తోపుడు బళ్లు ఏర్పాటు చేసి ఆక్రమిస్తున్నారు. గతంలో ఇక్కడ జీవీఎంసీ ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు ఉండేవి. వ్యాపారులు అవి లేకుండా చేశారు. అక్కడి గోడలను పగలకొట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్యానికి సీఎం భరోసా

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన
- 602 మందికి వైద్య సేవలు


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలతో కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు, జెడ్పీ కృష్ణ తదితరులు


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన మహిళలు


కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 43, 44 వార్డులకు చెందిన నాలుగు సచివాలయాల ప్రజలకు శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో గల నరసింహనగర్ యూపీహెచ్‌సీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసేలా 3,400 రకాల వ్యాధులను దాని పరిధిలోకి తెచ్చి రూ.1,000 నుంచి రూ.10 లక్షల వరకు విలువైన వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యేలా నాడు–నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించారని చెప్పారు. రోజుకొక స్పెషలిస్ట్ డాక్టర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరంలో వైద్యులచే ప్రజలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, ఆర్థికాభివృద్ధితోపాటు ఆరోగ్యానికి అన్ని విధాల భరోసా కల్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలు, మందులను, ఐసీడీఎస్ స్టాల్‌ను కె.కె.రాజు పరిశీలించారు. వైద్య సేవలు పొందిన వారికి కేస్ షీట్లు అందజేశారు.

అందుబాటులోకి ఆరోగ్య కేంద్రాలు

జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉత్తర నియోజకవర్గంలో కేవలం నాలుగు ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉండేవన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో లేక కేజీహెచ్‌కు వెళ్లేవారన్నారు. సమన్వయకర్త కె.కె.రాజు కృషితో రూ.5.18 కోట్లతో ఉత్తర నియోజకవర్గంలో ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాలను కొత్తగా నిర్మించినట్లు చెప్పారు. దీంతో 10 ఆరోగ్య కేంద్రాలు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపా రు. ఈ వైద్య శిబిరంలో 602 మంది వైద్య సేవలు పొందారు. 324 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్ కుమార్, మెడికల్ ఆఫీసర్ తనూజ, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, నీలి రవి, సీనియర్ నాయకులు కిరణ్‌రాజు, ఆళ్ల శివగణేష్, అంబటి శైలేష్, ఎం.సునీల్, సీతారాములు, వెంకటరావు, గోపి, ఎం.గోపి, రామారావు, వెంకట్, రవి, కన్నప్పడు, వల్లి, ఖాదర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

మా ఇద్దరికీ పరీక్షలు చేశారు



నేను, నా భార్య 70 ఏళ్ల వయసు నిండిన వాళ్లం. వైద్యులు మా ఇద్దరికీ బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. నా భార్యకు బీపీ, షుగర్ ఉందన్నారు. నాకు బాగుందని చెప్పారు. ఉచితంగా మందులు ఇచ్చారు. వారం రోజుల తర్వాత మళ్లీ రమ్మన్నారు. వైద్య శిబిరంలో సేవలు బాగున్నాయి.

– కె.జగ్గారావు, అచ్చియ్యమ్మ, సంఘం ఆఫీస్

ఆరు రకాల మాత్రలు ఇచ్చారు



నా వయసు 60 ఏళ్లు. కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. దూరాభారం వెళ్లి డాక్టర్‌కు చూపించుకో లేక ఇబ్బంది పడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డాక్టర్‌కు చూపించుకున్నాను. ఆరు రకాల మాత్రలు ఇచ్చారు. వారం తర్వాత మళ్లీ రమ్మన్నారు.

– పి.రాజేశ్వరి, యలమంచిలి వారి వీధి

బీపీ, సుగర్ టెస్ట్‌లు చేయించుకున్నా..



నాకు బీపీ, సుగర్ ఉన్నాయి. మందులు వాడుతున్నాను. చాలా కాలం నుంచి పరీక్షలు చేయించుకోలేదు. బీపీ, సుగర్ ఎంత ఉందో తెలియదు. జగనన్న వైద్య శిబిరంలో టెస్ట్‌లు చేసి బీపీ 147/82, సుగర్ 333 ఉందని చెప్పారు. నెల రోజులకు మందులిచ్చి మళ్లీ రమ్మని చెప్పారు.

– ఎస్. పార్వతి, నందగిరినగర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మద్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఉమ్మడి మసీను, ఎల్లయ్యమ్మ (50) దంపతులు కంచరపాలెం గంగన్ననగర్‌లో నివసిస్తున్నారు. ఈ నెల 11న బుధవారం సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి రైతుబజారుకు వెళ్తున్న క్రమంలో అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో ఎల్లయ్యమ్మకు గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. భర్త ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని మహిళకు..

మురళీనగర్ బ్యాంకు స్ట్రీట్‌లో నివసిస్తున్న పెనుమత్స శ్రీదేవి(55) గురువారం సాయంత్రం 4.30 గంటల సమయంలో స్కూటీపై బిర్లా జంక్షన్‌కు వెళ్తుండగా.. అటుగా వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీ కొంది. ఒక్కసారిగా ఆమె కింద పడిపోవడంతో ఎడమ కాలికి గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైకు ఢీకొని వ్యక్తికి..

కోపిశెట్టి కోటేశ్వరరావు తన భార్య కుమారితో కలిసి స్టీల్‌ప్లాంట్‌లో నివసిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి లో కుమారి నర్సుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి భార్యభర్తలిద్దరూ ద్విచక్ర వాహనంపై స్టీల్‌ప్లాంట్ నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అక్కడ ఊరు వెళ్తున్న తన భార్య కుమారిని రైలు ఎక్కించి తిరిగి భర్త ఇంటికి వెళ్తున్న క్రమంలో జ్ఞానాపురం గెడ్డ వీధి వద్దకు వచ్చేసరికి సుమారు రాత్రి 9.40 గంటల సమయంలో వెనుక నుంచి ఓ వ్యక్తి బైకుపై వచ్చి కోటేశ్వరరావును ఢీకొన్నాడు. కుడి కాలికి గాయాలైన అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై జీవీఎంసీ కమిషనర్‌కు వినతి


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ అభివృద్ధి పనులపై నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు శుక్రవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలను వారి చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరగాల్సిన అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వీధిలైట్లు, కొండవాలు ప్రాంతాల్లో మెట్లమార్గాలు, రక్షణ గోడల నిర్మాణాలపై కమిషనర్‌తో చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, పార్టీ మండల అధ్యక్షుడు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, వార్డు అధ్యక్షులు నీలి రవి, పీలా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు


ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, సంపంగి శ్రీనివాసరావు

సీతమ్మధార: లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24వ వార్డు నక్కవానిపాలెం ప్రధాన రహదారిలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి తెలిపారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు పర్యవేక్షణలో శుక్రవారం దసరా ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 9.45 గంటల నుంచి 25 వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. లక్ష కుంకుమార్చన, చండీ హోమం, సహస్ర దీపారాధన, సరస్వతీ పూజ నిర్వహిస్తామన్నారు. 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు భక్తులు ప్రసాదం స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ బండారు గుప్తాజీ, సభ్యులు రాజారెడ్డి, రాయుడు శ్రీను, రామిరెడ్డి, శ్రీనివాస్, రాజేష్‌రెడ్డి, జె.కె.రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఈబీ కాలనీలో సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ నెల 15 నుంచి దసరా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏపీఎస్‌ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, కె.సత్తిరాజు తెలిపారు. సీతమ్మధారలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఈబీ కాలనీలో 15న సాయంత్రం 7 గంటలకు స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ అంతర్జాతీయ స్థాయి బాల నృత్య కళాకారులతో బహుభాషా నృత్యాల ప్రదర్శనకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 16న సాయంత్రం వెంకటదుర్గా అన్నమాచార్య సంస్థ వారిచే కోలాటం, 17న విహాన్, సంజయ్, అనన్యలతో అన్నమయ్య సంకీర్తన, 18న బాలత్రిపుర సుందరి పూజ, 19న వెంకటరమణ బృందంతో సంగీత, నృత్య ప్రదర్శన, 20న సామూహిక కుంకుమ పూజలు, 21న ప్రొఫెసర్ మలయవాసిని ఆధ్వర్యంలో మహాశక్తి దుర్గ ప్రవచనాలు, 22న చైతన్య బ్రదర్స్, వర్షిణి బృందంచే అన్నమాచార్య కీర్తనలు, 23న న్యాయవాది, గాయకులు కె.రంగనాథ్, కె.రామారావులచే ప్రత్యేక సంగీత విభావరి, 24న సమీ పూజ, 25న అత్యంత వైభవంగా నిమజ్జనం కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో చైర్మన్, సింహాద్రిరాజు, కమిటీ సారథులు పి.ప్రభాకర్‌రావు, సుజన, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రేసపువానిపాలెంలో..

24వ వార్డు రేసపువానిపాలెంలోని శాంతి స్వరూపిణి దుర్గా ఆలయంలో ఈ నెల 15 నుంచి 23 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. బాలత్రిపుర సుందరి, గాయత్రిదేవి, అన్నపూర్ణ దేవి, మహాలక్ష్మి దేవి, లలితా త్రిపురా సుందరిదేవి, సరస్వతి దేవి, దుర్గాదేవి, మహిషాశుర మర్దనీదేవి, రాజరాజేశ్వరి దేవి అలంకరణల్లో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

బాడీబిల్డింగ్ పోటీల విజేతకు అభినందన


కుమార్‌ను అభినందిస్తున్న పేడాడ రమణికుమారి

మద్రిపాలెం: పవర్ లిఫ్టింగ్, బాడీలిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన కుమార్ ను వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు, అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణికుమారి అభినందించారు. ఈ నెల 5 నుంచి 9 వరకు నేపాల్‌లో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 8వ అంతర్జాతీయ క్రీడల టోర్నమెంట్‌లో విశాఖకు చెందిన కుమార్ గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా శుక్రవారం 51వ వార్డులోని ఆమె నివాసంలో విజేతను అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న కేజీహెచ్ వైద్యాధికారులు

దొండపర్తి: రొమ్ము క్యాన్సర్‌పై కేజీహెచ్ సీఎస్‌ఆర్ బ్లాక్ అంకాలజీ విభాగంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా రేడియోథెరపీ విభాగం 50 మందికి స్క్రీనింగ్ పరీక్ష చేసి క్యాన్సర్‌కు సంబంధించిన కారణాలు, ముందస్తు నిర్ధారణ, చికిత్స విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వార్డులో రోగులకు పళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, అంకాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ శిల్ప, రేడియోథెరపీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ పాండురంగకుమారి, ఏఆర్ఎంఓ డాక్టర్ గుడురి సీతామహాలక్ష్మి, ఇతర ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల సమస్యలు పరిష్కరించండి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతాల సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ గంకల కవిత, బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు కోరారు. ఈమేరకు శుక్రవారం వారు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందించారు. వార్డు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. పనులు సక్రమంగా జరగడం లేదని, కొన్ని ప్రాంతాల్లో నత్తనడకన సాగుతున్నందున వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొండవాలులో అదనంగా వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ సాయికాంత్‌వర్మ సానుకూలంగా స్పందించినట్లు కవిత తెలిపారు.

చోరీ కేసులో వేలిముద్రల పరిశీలన

సీతమ్మధార: మారుతీనగర్‌లో జరిగిన భారీ చోరీ కేసులో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. ఈ ఘటనపై ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు పాత నేరస్తుల వేలిముద్రలు పరిశీలిస్తున్నారు. మూడు రోజుల కిందట బాలయ్యశాస్త్రి లేఅవుట్ మారుతీనగర్‌లోని ఎంవీవీ సత్య హోమ్స్‌లో వజ్రాల ఆభరణాల చోరీ జరిగిన విషయం తెలిసిందే. పోలీసులు ఇప్పటికే గతంలో అక్కడ పనిచేసిన వర్కర్లు, వాచ్‌మెన్లను విచారించారు. అపార్ట్‌మెంట్ వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో నేరస్తులను పట్టుకోవడం పోలీసులకు కష్టతరంగా మారింది. పది రోజుల కిందట విజయవాడకు చెందిన శ్రీనివాసరెడ్డి డైమండ్ పార్కు వద్ద తన కారు పార్క్‌చేసి కుటుంబ సభ్యులతో కలిసి సాయిరాం హోటల్‌లో టిఫిన్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి కారు అద్దాలు పగలగొట్టి బంగారు నగలు దొంగలించారు. దీనిపై కూడా ఇంతవరకు పోలీసులకు స్పష్టత రాలేదు.

రైతులు ఐడీ కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలి


రైతులకు సూచనలిస్తున్న ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్

సీతమ్మధార: జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ పర్యవేక్షణలో శుక్రవారం సాయంత్రం సీతమ్మధార రైతుబజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ రైతులకు పలు సూచనలిచ్చారు. రైతులు తప్పనిసరిగా ఐడీ కార్డులు తీసుకురావాలని, లేనిపక్షంలో రైతుబజార్‌లోకి ప్రవేశం లేదని చెప్పారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని, స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఉదయం నుంచి 10 గంటల లోపు బల్క్‌గా కూరగాయలు విక్రయిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ధరల పట్టికలో కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

జీవీఎంసీ హైస్కూల్‌లో సేవా కార్యక్రమాలు


నిత్యావసర సరకులు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో సీనియర్ టీచర్ ఇంద్రాణి

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు జి.సన్యాసిరావు ఆధ్వర్యంలో శుక్రవారం సీనియర్ టీచర్ కె.ఇంద్రాణి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 12 మంది పేద విద్యార్థులకు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. 9వ తరగతి చదువుతున్న జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పార్టిసిపెంట్ చంద్రికకు వాచ్, దుస్తులను బహుమతిగా అందించారు. ఇంటర్‌స్కూల్ లెవెల్ కబడ్డీలో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థులకు, బాక్సింగ్‌లో పాల్గొన్న 7వ తరగతి విద్యార్థికి బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 25 మంది స్టూడెంట్లకు టీచర్ ఇంద్రాణి తన సొంత నిధులతో వాటిని అందజేశారు. ఈ స్కూల్‌లో పేద విద్యార్థులను ప్రతి ఏడాది ఇదే విధంగా ప్రోత్సహిస్తున్న ఇంద్రాణిని సహచర సిబ్బంది ప్రశంసించారు.

విద్యార్థులకు నైపుణ్యాలు ముఖ్యం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

డాబాగార్డెన్స్: విద్యార్థులకు నైపుణ్యం చాలా ముఖ్యమని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి అభిప్రాయపడ్డారు. శుక్రవారం కళాశాల ఐక్యూఏసీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రొగ్రాం ఫర్ పొటెన్షియల్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నైపుణ్యం ద్వారా జీవితంలో వచ్చే అనేక సమస్యలు సులభంగా పరిష్కరించుకోగలమన్నారు. అనంతరం ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ స్త్రీలు తమకున్న నైపుణ్యాలను వ్యాపారంలో పెట్టుబడిగా పెడితే అద్భుతాలు సాధించగలరని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డేవిడ్‌రాజు కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, అనురాధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.